TGTEL/26/A6221



తొలివెలుగు జాతీయపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365

# తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ పత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 36 | మంగళవారం | 01-సెప్టెంబర్-2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/-
Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue:36 | Tuesday | 01-8-2026 | Editor: Yamjala Praveen | Pages: 8 | Cost: 2/-



# వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు

**మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం**

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు.

- నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ
- 2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ
- నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి

1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను.



## పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

2లో

- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ప్రజల అభిప్రాయాలు, డేటా ఆధారంగా పౌరసేవలు మెరుగుపరచాలని సీఎం ఆదేశం
- పారిశుద్ధ్యంపై రాజీ లేదని, సంక్షేమ హాస్టళ్లలో నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని సూచన
- ప్రభుత్వ శాఖల సేవలు, ధ్రువపత్రాల జారీ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరగాలని నిర్దేశం
- వెలిగొండ తరహాలో ప్రతి కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యం పెంచాలని పిలుపు
- నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోవాలని ఆదేశాలు

## మెస్సీ శకం ముగిసింది..

- అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్
- అంతర్జాతీయ ఫుట్‌బాల్ కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించిన లియోనెల్ మెస్సీ
- రెండు దశాబ్దాల తన అర్జెంటీనా కెరీర్‌కు భావోద్వేగంగా ముగింపు
- 2026 వరల్డ్ కప్ ఫైనల్ ఓటమి, తండ్రి మరణం తన నిర్ణయాన్ని మరింత బలపరిచాయన్న మెస్సీ
- ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులకు, జట్టు సభ్యులకు కృతజ్ఞతలు
- క్లబ్ ఫుట్‌బాల్‌లో ఇంటర్ మయామి తరఫున ఆడటం కొనసాగిస్తానని స్పష్టీకరణ



మెస్సీ ఒక ఉత్పాతం, మౌన ముని. ఎన్ని అడ్డంకులు, వివాదాలు ఎదురైనా తన ఆటతోనే సమాధానం చెప్పాడు తప్ప హద్దులు మీరిన సందర్భాలు చాలా తక్కువ. నిజానికి మెస్సీకి కోపం కూడా ఎక్కువే. కానీ దాని అవసరం ఎంతమేర ఉంటుందో అంతే చూపిస్తుంటాడు. కాబట్టే ఇవాళ ప్రపంచంలో ప్రతీ మూలన అభిమానులను సంపాదించుకున్నాడు. గతంలో ఫుట్‌బాల్ పీలే, మారడోనా సహా ఎందరో దిగ్గజ ఆటగాళ్లను అందించినప్పటికీ ఈ తరంలో మాత్రం మెస్సీనే దిగ్గజ ఆటగాడు. ఇంకా చెప్పాలంటే అతడో ఆరాధ్య దైవం.

అలాంటి ఈ తరంలో ఫుట్‌బాల్ తెలిసినోడిని నిద్రలో నుంచి లేపి ఒక ఆటగాడి పేరు చెప్పమంటే మొదట వినిపించే పేరు లియోనెల్ మెస్సీ. రెండు దశాబ్దాలుగా తన ఆటతో ఫుట్‌బాల్ అభిమానుల గుండెల్లో గుడి కట్టేసుకున్న మెస్సీ చూడాల్సినవన్నీ చూశాడు. ఎనిమిది సార్లు బాలన్ డీ ఓర్ అవార్డు, ఆరుసార్లు యూరోపియన్ గోల్డెన్ షూస్, ఎనిమిది సార్లు ఫిఫా బెస్ట్ ప్లేయర్, అలాగే 2025లో ఆల్‌టైమ్ బెస్ట్ ప్లేయర్‌గాను నిలిచాడు. తన కెరీర్‌లో లోటుగా ఉన్న ఫిఫా ప్రపంచకప్‌ను కూడా నాలుగేళ్ల కిందట ఖతార్‌లోనే అందుకున్నాడు. అల్విదా మెస్సీ.

2లో

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

- సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు
- పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం

2లో



# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

- మూసారాంబాగ్ వద్ద కొత్త బ్రిడ్జిని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించామన్న సీఎం
- కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని తీవ్ర ఆరోపణ
- ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని వెల్లడి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట - మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో సాధ్యం కాని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు. వర్షం వస్తే మునిగిపోయే పాత వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఆలోచించలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ కార్యాలయాలు లేవని, స్థానిక ప్రజల

- మిగతా 2వ పేజీలో





## పుట్టింటి నుంచే బయటకు పంపారు'..

- సభలో బోరున విలపించిన కవిత
- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య


- మిగతా 2వ పేజీలో

## ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

- విశాఖ జిల్లాలో నారా లోకేశ్ పృటన
- హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి
- హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ
- ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనం ప్రారంభం
- జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు ప్రారంభోత్సవం

2లో



## అంతులేని యుద్ధం కాదు.. యుద్ధానికి ముగింపు కావాలి

- ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం
- అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు వైపు వెళ్లాలన్న మోదీ
- శాంతియుత పరిష్కారాలకే భారత్ మద్దతు ఇస్తుందని వెల్లడి
- ఎస్‌సీఓ సదస్సు వేదికగా ఇరువురు నేతల భేటీ
- వచ్చే వారం భారత్‌కు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

2లో

## నిర్భయ తరహాలో ఘోరం..

- కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం
- గ్రేటర్ నోయిడాలో కదులుతున్న బస్సులో బాలికపై గ్యాంగ్ రేప్
- లిఫ్ట్ అడిగితే బస్సులోకి ఎక్కించుకుని అఘాయిత్యం
- బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
- ఢిల్లీలో వదిలేసి పరారైన నిందితులు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2012 నిర్భయ ఘటనను గుర్తుచేసేలా మరో దారుణం గ్రేటర్ నోయిడాలో చోటుచేసుకుంది. కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

- మిగతా 2వ పేజీలో



## పుట్టింటి నుంచే బయటకు పంపారు'..

(మొదటి పేజీ తరువాయి)

సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

## అంతులేని యుద్ధం కాదు.. యుద్ధానికి ముగింపు కావాలి

కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు. ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి" అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

## నిర్భయ తరహాలో ఘోరం..

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 4న జరిగిన ఈ అమానవీయ ఘటనకు సంబంధించిన వివరాలు ఇప్పుడు దేశాన్ని ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన 16 ఏళ్ల బాలిక, చదువు విషయంలో తల్లి మందలించడంతో ఇంట్లో చెప్పకుండా నోయిడాలోని తన బంధువుల ఇంటికి బయలుదేరింది. అయితే, చీకటి పడటం, భారీ వర్షం కురుస్తుండటంతో నోయిడాలోని ప్యారి చౌక్ వద్ద బస్సు దిగింది. అప్పటికే రాత్రి 9 గంటలు కావొచ్చింది. తాను చేరాల్సిన గమ్యం ఇంకా 25 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలుసుకుని, వర్షంలో తడుస్తూ ఒంటరిగా నిల్చుంది. ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆమె దగ్గర ఆగింది. అది లాంగ్ డిస్టెన్స్ ప్రయాణాల కోసం ఉపయోగించే స్లీపర్ బస్సు కావడం, అందులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడం గమనార్హం. తాము కూడా నోయిడా సెక్టార్ 63 వైపే వెళుతున్నామని కండక్టర్ చెప్పడంతో బాలిక బస్సు ఎక్కింది. వాస్తవానికి ఆ బస్సు గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లోని ఓ వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదలడం ప్రారంభించిన కొద్దిసేపటికే కండక్టర్ అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అనంతరం ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే చంపేస్తామని డ్రైవర్, కండక్టర్ ఆమెను బెదిరించారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణం తర్వాత, బాధితురాలిని ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వద్ద రింగ్ రోడ్ సమీపంలో వదిలేసి పరారయ్యారు. ధైర్యం కూడగట్టుకున్న బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)లను ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్‌లోని ఓ పార్కింగ్ స్థలంలో అరెస్ట్ చేశారు. విశ్వనాథ్ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

(మొదటి పేజీ తరువాయి)

సౌకర్యార్థం ఇక్కడ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, 10 ఎకరాల స్థలంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. బతుకమ్మ కుంట కబ్జాకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరి హస్తముందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తాము బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, కనీసం ఏడో తేదీ వచ్చినా ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొని ఉండేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు కలిసి కేవలం రూ. 70 వేల కోట్లు అప్పు చేస్తే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం చెరువులను కబ్జా చేసి విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని, కేవలం ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడుతోందని స్పష్టం చేశారు. గతంలో తనను విమర్శించిన ఉద్యోగులే ఇప్పుడు తమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన ఉద్యోగులను కోరారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు.

# వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు. సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు. ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు. దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.

## పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)



ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో 'అవేర్' (ఇూఔూ=జు) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు.

## మెస్సీ శకం ముగిసింది..

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

"ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు. తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు. రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. "గడిచిన 20 ఏళ్లుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను" అని తెలిపాడు.

# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

"ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ" అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. దివంగత 'పద్మశ్రీ' డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు, వారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ భూమిలో నేడు కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కొనియాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో, వృద్ధుల కోసం అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం గొప్ప విషయమని ప్రశంసించారు. "విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, విలువలు, నైతికతతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి. అందుకే ఆయనకు కేబినెట్ హోదాతో సలహాదారు బాధ్యతలు అప్పగించాం. ఆయన సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన పుస్తకాలను అందిస్తాం" అని లోకేశ్ వివరించారు. వృద్ధులు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ.4,000 పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు.

### విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర విభజన తర్వాత విశాఖ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో విశాఖను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖ అభివృద్ధిలోనూ కొత్త బెంచ్‌మార్క్ సృష్టిస్తామని అన్నారు.

### అపోహలు వద్దు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం

అభివృద్ధి విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని లోకేశ్ అన్నారు. "ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. డేటా సెంటర్ల విషయంలో కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి ఆధునిక సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం" అని హామీ ఇచ్చారు.



## బొర్రోళ్లగూడెంలో బోనాల కోలాహలం

- ఆధ్యాత్మిక శోభతో నిండిన గ్రామం.. భక్తిశ్రద్ధలతో బోనాల సంబరాలు
- ఘనంగా బోనాల పండుగ వేడుకలు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు.. నైవేద్యాల సమర్పణ

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం మల్కాపూర్ పరిధిలోని బొర్రోళ్లగూడెంలో బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బంధారపు కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ముప్పిడి లింగ స్వామి గౌడ్, వీరమల్ల నరసింహ గౌడ్, లగ్గోని పాండు గౌడ్, బంధారపు మల్లేష్ గౌడ్, బంధారపు రాజు గౌడ్, వి. సుకునమ్మ, ఎం. వసంత, వి. అనిత, ఎల్. పావని, బి. జ్యోతి, బి. సంతోష, మాధవి, పి. శ్రీకాంత్, మౌనిక, శ్రీనివాస్ గౌడ్, స్వప్న, అనుశ్రీ, ప్రణయ శ్రీ, భరత్, శ్రీ చరణ్, దినేష్, శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## బట్టపోతు రాములు సేవలు అభినందనీయం

- వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు.. 200 క్యాన్ల అందజేత
- రాములు 6వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు





**తొలివెలుగు, చౌటుప్పల్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కీర్తిశేషులు బట్టపోతు రాములు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని దామెర సర్పంచ్ సాతిరి శ్రీధర్ అన్నారు. రాములు 6వ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల పరిధిలోని దామెర గ్రామ వాటర్ ప్లాంట్‌కు కుటుంబ సభ్యులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి, 200 వాటర్ క్యాన్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గతంలోనూ రాములు జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించడమే కాకుండా ఉచిత వైద్య శిబిరాలు, వృద్ధులకు చేతికర్రలు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పునూతల నరసింహ, కుటుంబ సభ్యులు బట్టపోతు కరుణ, విజయ్, విక్రమ్, వరుణ్, భిక్షం, సరిపల్లి మంజుల, పెరుమాళ్ళ అరవిందు, ఐతగోని నరసింహ, సాతిరి మధు, ఊడగు యాదయ్య, సాతిరి ధనరాజు, సత్తయ్య, రాఘవేంద్ర, శ్రీనివాస, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత దంత, ఆరోగ్య శిబిరం

- గ్రామస్తులకు వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ
- కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో సేవలు

**తొలివెలుగు, చౌటుప్పల్:** గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో సోమవారం ఉచిత దంత, ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్‌రెడ్డి ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి, నార్కట్‌పల్లి సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో కామినేని ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గ్రామస్తులకు దంత, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. దంత సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సలహాలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దంత ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, కామినేని ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి వరుణ్ ప్రతిభ అభినందనీయం

- చిన్న వయసులోనే అద్భుత నైపుణ్యాలు
- ఘనంగా సత్కరించిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు
- ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: గంధమల్ల ఆనంద్ గౌడ్
- పైల్వాన్‌పురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి అభినందనలు





**తొలివెలుగు, వలిగొండ :** విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఆకాంక్షించారు. చిన్న వయసులోనే ప్రతిభను చాటుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. వలిగొండ మండలం పైల్వాన్‌పురం ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బహుముఖ ప్రజ్ఞాశాలి విద్యార్థి వరుణ్‌ను సోమవారం గంధమల్ల ఆనంద్ గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజక సామాజిక వర్గానికి చెందిన వరుణ్ చిన్న వయసులోనే పలు భాషల్లో అనర్గళంగా మాట్లాడటంతో పాటు సోషల్ మీడియా వేదికగా తన ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింత ప్రోత్సహించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. బీజేపీ వలిగొండ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు సుర్వి శ్రీనివాస్ గౌడ్, రత్నపురం శ్రీశైలం, రామచంద్రం ముదిరాజ్, తెల్బూరి రాములు యాదవ్, వెంకటేశం, అశోక్ రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కంఠమహేశ్వరుని బోనాలు





- ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిన ఆలయ ప్రాంగణం
- భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించిన గౌడ కులస్తులు

**తొలివెలుగు, వలిగొండ :** మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామి, సురమాంబ దేవి బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను తలపై ఎత్తుకుని మంగళహారతులు, డప్పుచప్పుళ్లతో ఆలయానికి తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మోతతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం కమిటీ ప్రతినిధులు, కుల పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా కంచరకుంట్ల రాంరెడ్డి జన్మదిన వేడుకలు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసిన రాంరెడ్డి
- కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన శాసనసభ్యుడు
- ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్ష

**తొలివెలుగు, హైదరాబాద్/చౌటుప్పల్ :** యువజన కాంగ్రెస్ నాయకుడు కంచరకుంట్ల రాంరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లిన రాంరెడ్డి, ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్వయంగా రాంరెడ్డితో కేక్ కట్ చేయించి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో నిరంతరం ముందుకు సాగుతూ భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు రాంరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు రాంరెడ్డి సేవలను కొనియాడారు.



## ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన ఎమ్మెల్యే

- పర్మినెంట్ బస్‌స్టాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- స్వయంగా ఆర్టీసీ బస్సు నడిపిన శాసనసభ్యుడు
- గ్రామంలోనే బస్సు ఎక్కే అవకాశం.. స్థానికుల హర్షం



**తొలివెలుగు, యాదగిరిగుట్ట :** వంగపల్లి గ్రామ ప్రజల చిరకాల కోరికను నెరవేరుస్తూ గ్రామంలో పర్మినెంట్ బస్‌స్టాప్ పాయింట్‌తో పాటు నూతన బస్సు సర్వీసును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ఆర్టీసీ బస్సును నడిపి స్థానికులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో వంగపల్లి ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించామని తెలిపారు. బస్‌స్టాప్, నూతన సర్వీసు అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు, మహిళలు బస్సు కోసం ప్రధాన రహదారుల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే బస్సు ఎక్కే సౌకర్యం కలిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రవాణా సౌకర్యాల మెరుగుదలతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. నూతన బస్సు సర్వీసు, పర్మినెంట్ బస్‌స్టాప్ అందుబాటులోకి రావడంతో వంగపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## చేయూత' పింఛన్ గడువు పొడిగించాలి

- పత్రాల జారీలో ఆలస్యంతో లబ్ధిదారుల ఇబ్బందులు
- ఎంఈఎఫ్ జిల్లా నాయకుడు ఇంజ మహేష్ మాదిగ విజ్ఞప్తి



**తొలివెలుగు, రాజాపేట :** గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన నిరుపేదలకు అందిస్తున్న చేయూత పింఛన్ దరఖాస్తుల గడువును ప్రభుత్వం తక్షణమే పెంచాలని ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకుడు ఇంజ మహేష్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... పింఛన్‌కు అవసరమైన కుల, ఆదాయ, సదరం ధ్రువీకరణ పత్రాల సేకరణలో చదువురాని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తహశీల్దార్ ఆఫీసుతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల ధ్రువపత్రాల జారీ ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. దీనివల్ల అనేకమంది అర్హులైన పేద కుటుంబాలు పథకానికి దూరమయ్యే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే ఆలోచించి దరఖాస్తు గడువును పొడిగించాలని కోరారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

- రూ.5 వేల జరిమానా.. బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**తొలివెలుగు, నల్లగొండ టౌన్ :** దిండి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఫోక్సో అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. ఈ మేరకు నల్లగొండలోని ఫాస్ట్‌ట్రాక్ (రేప్ అండ్ ఫోక్సో) కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. దిండి మండలం ప్రతాప్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ముదావత్ మల్లేష్‌పై 2020లో ఐపీసీ సెక్షన్ 376(2), 506తో పాటు ఫోక్సో చట్టం కింద కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో బలమైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించినట్లు ఎస్పీ తెలిపారు. నేరం రుజువు కావడంతో నిందితుడు మల్లేష్‌కు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. అలాగే బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం అందజేయాలని స్పష్టం చేసింది. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా, నేరస్థులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన దర్యాప్తు అధికారులు, లీగల్ ఆఫీసర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ), పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్‌కు ఘన సత్కారం

- చిట్యాలలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సన్మానం
- పూలదండలు, శాలువాలతో అభినందనలు



**తొలివెలుగు, చిట్యాల:** బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కంబాలపల్లి సతీష్ యాదవ్‌ను సోమవారం చిట్యాలలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సతీష్ యాదవ్‌కు శాలువా కప్పి, పూలదండలు వేసి అభినందనలు తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకిరేకంటి మొగులయ్య, పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాసా శ్రీనివాస్, నాయకులు కన్నబోయిన మహాలింగం, గంజి గోవర్ధన్, కూరెళ్ల శ్రీనివాస్, జయారపు రామకృష్ణ, పల్లె వెంకన్న, కంచర్ల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్
- విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదన్న ఆరూరి ప్రణీత్




**తొలివెలుగు, చిట్యాల :** ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం చిట్యాలలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నకిరేకల్ డివిజన్ అధ్యక్షుడు ఆరూరి ప్రణీత్ మాట్లాడుతూ... విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చందు, కో-కన్వీనర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ సిలిండర్‌కు.. 'వాణిజ్య' సెగ!

- అనస్వర ఎంటర్‌ప్రైజెస్‌లో యథేచ్ఛగా గృహ సిలిండర్ల వాడకం
- అధికారుల మౌనంపై ప్రజల అనుమానాలు.. ప్రజాప్రతినిధుల అండతోనే దందా?



**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో గ్యాస్ సిలిండర్ల అక్రమ మళ్లింపు యథేచ్ఛగా సాగుతోంది. గ్రామంలోని 'అనస్వర ఎంటర్‌ప్రైజెస్' నిబంధనలకు పాతిపెట్టి, గృహ వినియోగం కోసం ఇచ్చే సబ్సిడీ సిలిండర్లను వాణిజ్య (కమర్షియల్) అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**చట్టానికి నీళ్లు.. బహిరంగంగానే అక్రమాలు:**

సాధారణంగా గృహ అవసరాలకు పంపిణీ చేసే ఎల్‌పీజీ సిలిండర్లను వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు వినియోగించడం చట్టరీత్యా నేరం. కానీ, అనస్వర ఎంటర్‌ప్రైజెస్‌లో మాత్రం ఎలాంటి భయాందోళనలు లేకుండా గృహ సిలిండర్లను కమర్షియల్ సెటప్‌లో వాడుతుండటం గమనార్హం. సబ్సిడీ ధరకు వచ్చే సిలిండర్లను వ్యాపారానికి మళ్లించడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడమే కాకుండా, స్థానికంగా లభించాల్సిన గృహ వినియోగ కోటాపై కూడా ప్రభావం చూపుతోందని ప్రజలు మండిపడుతున్నారు.


**అధికారుల కన్నుపడని వింత!**

ఇంత బహిరంగంగా నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా, సంబంధిత పౌరసరఫరాల (సివిల్ సప్లైస్) శాఖ అధికారులుగానీ, రెవెన్యూ యంత్రాంగం గానీ కన్నెత్తి చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ సరిహద్దుల్లో బహిరంగంగా అక్రమ వినియోగం జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక రహస్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజాప్రతినిధుల అండదండలు?**

ఈ అక్రమ దందా వెనుక ప్రజాప్రతినిధుల హస్తం ఉందనే గుసగుసలు గ్రామంలో బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల అభయహస్తం, అధికారుల ఉదాసీనతతోనే సదరు నిర్వాహకులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, 'అనస్వర ఎంటర్‌ప్రైజెస్'పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.






# తీర్మానం లేదు.. సమాచారం లేదు.. జీపీ ఆస్తులు గల్లంతు!

- రాజాపేట ప్రజావాణిలో 15 అర్జీలు స్వీకరణ
- పాముకుంట పంచాయతీ సామాగ్రి అమ్మకాలపై గ్రామస్తుడి ఫిర్యాదు
- విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 15 దరఖాస్తులు అందినట్లు నోడల్ అధికారి, ఎంపీఓ ఆవుల కిషన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**పంచాయతీ ఆస్తుల విక్రయంపై ఫిర్యాదు:**

పాముకుంట గ్రామపంచాయతీకి చెందిన పాత మోటార్లు, విద్యుత్ సామగ్రి, ఇతర వస్తువులతో పాటు చెట్లను గ్రామసభ తీర్మానం లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా విక్రయించారని గ్రామస్తుడు రంగా నరేష్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంచాయతీకి చెందిన ఆస్తులను విక్రయించే ముందు నిబంధనల ప్రకారం గ్రామసభలో తీర్మానం చేయడంతో పాటు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటూ.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను కోరారు. పంచాయతీ ఆస్తుల విక్రయంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.




## ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- రాజపేటలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి: సీపీఐ నాయకుడు చిగుళ్ల లింగం

**తొలివెలుగు, రాజపేట :** యాదగిరిగుట్టలో సెప్టెంబరు 8, 9, 10 తేదీల్లో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుళ్ల లింగం పిలుపునిచ్చారు. రాజపేట మండల కేంద్రంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజపేట మండలంలో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కాంట్రాక్టు రంగాల్లో పనిచేస్తున్న యువకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించాలని కోరారు. రాబోయే రోజుల్లో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మూల పోచయ్య, నాయకులు దయ్యాల సిద్ధులు, కొయ్య బాబు, బొడ్డుల మహేష్, తరిగొప్పుల సిద్ధులు, నాగారం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి వరుణ్ ప్రతిభ అభినందనీయం

- చిన్న వయసులోనే అద్భుత నైపుణ్యాలు
- ఘనంగా సత్కరించిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు
- ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: గంధమల్ల ఆనంద్ గౌడ్
- పైల్వాన్‌పురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి అభినందనలు



**తొలివెలుగు, వలిగొండ :** విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఆకాంక్షించారు. చిన్న వయసులోనే ప్రతిభను చాటుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. వలిగొండ మండలం పైల్వాన్‌పురం ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బహుముఖ ప్రజ్ఞాశాలి విద్యార్థి వరుణ్‌ను సోమవారం గంధమల్ల ఆనంద్ గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజక సామాజిక వర్గానికి చెందిన వరుణ్ చిన్న వయసులోనే పలు భాషల్లో అనర్గళంగా మాట్లాడటంతో పాటు సోషల్ మీడియా వేదికగా తన ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింత ప్రోత్సహించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. బీజేపీ వలిగొండ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు సుర్వి శ్రీనివాస్ గౌడ్, రత్నపురం శ్రీశైలం, రామచంద్రం ముదిరాజ్, తెల్హూరి రాములు యాదవ్, వెంకటేశం, అశోక్ రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



## చెరువుల ఆక్రమణలు తొలగించాలి

- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన చల్లూరు వాసి
- అధికారులను వివరాలు కోరిన జిల్లా కలెక్టర్

**తొలివెలుగు, రాజపేట :** మండల పరిధిలోని చల్లూరు గ్రామంలోని చెరువుల ఆక్రమణలను తొలగించి, రక్షణ కల్పించాలని కోరుతూ గ్రామానికి చెందిన మాటూరు శ్రీనివాస్ గౌడ్ సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఆర్డీవో, జిల్లా రెవెన్యూ అధికారిణి (డీఆర్వో) జయమ్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని ప్రధానమైన మల్లాయి చెరువుపై జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా సరిహద్దులు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని కోరారు. అలాగే గ్రామంలోని మరొక ప్రధాన చెరువైన 'మల్లవాని చెరువు' ప్రధాన కాలువను మూసివేశారని, ఆ ఆటంకాలను తొలగించి కాలువను తక్షణమే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్... సంబంధిత రెవెన్యూ అధికారులను క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించినట్లు (ఎండార్స్ చేసినట్లు) శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.





# ఉన్నత లక్ష్యాలకు నిరంతర సాధనే మార్గం

- పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా: మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు
- టిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** విద్యార్థులు అనుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే నిరంతర సాధన ఒక్కటే సరైన మార్గమని భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు సోమవారం టిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ తడక రమేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... తాను చదువుకున్న పాఠశాల సర్వాంగీణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో విద్యార్థులు అద్భుత విజయాలు సాధించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. విద్యార్థులకు బాసటగా నిలుస్తున్న టిఆర్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.కిష్టయ్య, టిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వలందాస్ ప్రవీణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సమస్యలు తీర్చేందుకే 'ప్రజావాణి'

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో విజయ
- మూడు వినతులు స్వీకరణ




**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** మండలంలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఎంపీడీవో విజయ తెలిపారు. పురపాలక కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ... సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 3 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో రెవెన్యూ (తహశీల్దార్) విభాగానికి సంబంధించి రెండు, మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి ఒక అర్జీ ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

- ఎంపీడీవో సుజాత వెల్లడి
- మూడు వారాల్లో 250 దరఖాస్తుల స్వీకరణ
- ఉగ్గంపల్లి రైతు వేదికలో మండల స్థాయి కార్యక్రమం

**తొలివెలుగు, చిన్నగూడూరు :** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుజాత కోరారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి రైతు వేదికలో సోమవారం ఎంపీడీవో సుజాత అధ్యక్షతన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత మూడు వారాల్లో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి దాదాపు 250 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 'గాంధీనగర్' సమస్యలపై కదిలిన యంత్రాంగం!

- 'తొలివెలుగు' కథనానికి అధికారుల స్పందన
- క్షేత్రస్థాయి పరిశీలనకు సన్నద్ధం
- వీధిదీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలకు పరిష్కార హామీ
- అధికారుల స్పందనపై స్థానికుల్లో హర్షం



తొలివెలుగు ఎఫెక్ట్



**తొలివెలుగు, జన్నారం :** ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలతో సతమతమవుతున్న పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ వార్డు ప్రజలకు ఎట్టకేలకు ఊరట లభించనుంది. వార్డులో నెలకొన్న మౌలిక వసతుల కొరత, వీధిదీపాల సమస్య, అసంపూర్తి సీసీ రోడ్లు, అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థపై ' తొలివెలుగు 'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి గ్రామపంచాయతీ అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు స్పందించారు. కథనం వెలువడిన నేపథ్యంలో వార్డులో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఇన్నాళ్లుగా తమ సమస్యలు పట్టించుకునేవారు లేరని ఆవేదన వ్యక్తం చేసిన స్థానికుల్లో ఆశలు చిగురించాయి.

**సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన:**

'తొలివెలుగు' లో ప్రచురితమైన కథనాన్ని పరిశీలించిన అధికారులు గాంధీనగర్‌లో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించేందుకు సన్నద్ధమవుతున్నారు. వార్డులోని ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల వివరాలను సేకరించి, వాటి తీవ్రత ఆధారంగా ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వీధులు చీకటిమయంగా మారడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీధిదీపాల సమస్యను ప్రాథమికంగా పరిష్కరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

**డ్రైనేజీ, రోడ్లపైనా దృష్టి:**

గాంధీనగర్‌లో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థపై కూడా అధికారులు దృష్టి సారించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో పాటు, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే నాసిరకంగా ఉన్న, అసంపూర్తిగా మిగిలిన సీసీ రోడ్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల పరిస్థితిని మెరుగుపరచనున్నట్లు పేర్కొన్నారు.


**అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం:**

పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మెరుగైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని అధికారులు తెలిపారు. గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ అందుబాటులో ఉన్న నిధులతో పాటు అవసరమైన ఇతర వనరులను సమీకరించి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**'తొలివెలుగు'కు కృతజ్ఞతలు:**


తమ వార్డులో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'తొలివెలుగు'కు గాంధీనగర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలపై పత్రికలో కథనం ప్రచురితమైన వెంటనే అధికారులు స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే అధికారులు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వీధిదీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి తమ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కథనం ప్రభావంతో యంత్రాంగం కదలడంతో గాంధీనగర్ వార్డులో మౌలిక వసతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.





# ప్రజలకు అందుబాటులోకి పీఎన్‌బీ సేవలు



- నగర సర్కిల్‌లో 78వ బ్యాంక్ శాఖ ప్రారంభం
- ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్న జీఎం వందనా పాండే

**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్ ప్రాంత ప్రజలకు, స్థానిక వ్యాపారులకు వేగవంతమైన బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) సోమవారం నూతన శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి పీఎన్‌బీ హైదరాబాద్ జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ వందనా పాండే ముఖ్య అతిథిగా హాజరై నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం వందనా పాండే మాట్లాడుతూ.. హైదరాబాద్ సర్కిల్ పరిధిలో ఇది 78వ శాఖ అని వెల్లడించారు. వేగంగా విస్తరిస్తున్న హయత్‌నగర్ పరిసర ప్రాంతాల జనాభా, వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఈ శాఖను అందుబాటులోకి తెచ్చామన్నారు. సురక్షిత డిజిటల్ సేవలతో పాటు పొదుపు, కరెంట్ ఖాతాలు, వివిధ రకాల రుణాలను స్థానికంగానే త్వరితగతిన అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ హెడ్లు అరవింద్ కల్రా, సుజీత్ సింగ్ ఝా, స్థానిక మేనేజర్ నిరంజన్, రాము, బ్యాంక్ అధికారులు, స్థానిక ఖాతాదారులు పాల్గొన్నారు.

# నేత్రదానంతో అంధత్వ నివారణ శక్యం

- 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు
- సంతోష్‌నగర్‌లో అవగాహన సదస్సు, ర్యాలీ

**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, విరివిగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని 'బీ ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ' వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్ కళ్యాణ్ చల్లా పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా వాసన్ ఐ బ్యాంక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సంతోష్‌నగర్‌లో సోమవారం నేత్రదాన అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కార్నియాల సేకరణను మరింత పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.




వాసన్ ఐ కేర్ వైద్యాధికారులు డాక్టర్ సంతోష్, డాక్టర్ తస్లీమ్ మాట్లాడుతూ... సమాజంలో నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కార్నియా సేకరణను పెంచేందుకు శిక్షణ పొందిన టెక్నీషియన్లు, అదనపు కలెక్షన్ సెంటర్లు అవసరమని తెలిపారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఆసుపత్రి సిబ్బంది, ప్రతినిధులు రెహ్మాన్, తేజ, నవీన్ శరవణన్, మధు అరవింద్ పాల్గొన్నారు.



# పేదింటి కల్యాణానికి 'పీసీఆర్' చేయూత

**వివాహానికి రూ.5 వేల సహాయం అందజేత**

**చింతగూడలో ఉదారత చాటుకున్న ఫౌండేషన్**

**ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామన్న నిర్వాహకులు**

**తొలివెలుగు, జన్నారం :** మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన బిస్కుల రామన్న-సరోజ దంపతుల కుమార్తె మానస వివాహానికి పీసీఆర్ (పూర్ణచందర్‌రావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి ముడుగు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు, ఇతర అత్యవసర అవసరాలకు నిరంతరం అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నోముల రాజ్‌కుమార్, కొత్త శ్రీనివాస్, కానగంటి దేవయ్య, చింతల సతీష్, ఇప్ప మహేష్, కుడుకల రాజేందర్, మాజీ ఎంపీటీసీ సుతారి వినయ్, కోడూరి ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

- **37 ఏళ్ల సర్వీసును గుర్తుచేసుకున్న ఎంఈఓ చందా రమేష్**
- **పాముకుంట బడిలో భావోద్వేగంగా సాగిన వీడ్కోలు**



**తొలివెలుగు, రాజపేట:** రాజపేట మండల విద్యాధికారి (ఎంఈఓ), గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చందా రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా మండల పరిధిలోని పాముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పొన్న సత్యానంద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆయనను శాలువాలు, పూలమాలలు, ప్రత్యేక జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చందా రమేష్ మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. తన 37 సంవత్సరాల ఉద్యోగ ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జెల్ల ప్రభాకర్, కోటి రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు మారోజు శశికుమార్, రవీంద్రా రెడ్డి, బత్తిని పరమేశ్, పాఠశాల సిబ్బంది గౌటె బాలరాజు, శ్రీనివాస్, గణేష్, నారాయణ, పారిజాత, విజయలక్ష్మి, రమాదేవి, ప్రభ, శ్రీవిద్య, ప్రాథమిక పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బండకింది బాలరాజు, ఎమ్మార్సీ సిబ్బంది వెంకటరెడ్డి, అశోక్, సత్యం, స్వప్న, సంధ్యా రాణి, కిరణ్ పాల్గొన్నారు.

# ప్రజావాణి మభ్యపెట్టడానికే!

- **ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు**
- **బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆగ్రహం**
- **నోడల్ అధికారికి వినతిపత్రం అందజేత**



**తొలివెలుగు, రాజపేట:** ప్రజావాణి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని బిఆర్ఎస్ రాజపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ విమర్శించారు. రాజపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మూడో విడత ప్రజావాణి కార్యక్రమం సాగుతున్న సమయంలో ఆయన నేతృత్వంలో పార్టీ నాయకులు నోడల్ అధికారి ఆవుల కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ... గత మూడు వారాలుగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారే తప్ప ఏ ఒక్క సమస్యకు పరిష్కారం చూపడంలేదని ఆరోపించారు. గ్రీవెన్స్ కేవలం అర్జీలు తీసుకోవడానికి మాత్రమే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టడానికే మండల స్థాయిలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, మాజీ సర్పంచులు పయ్యావుల ఎల్లయ్య, గుంటి కృష్ణ, రామిండ్ల నరేందర్, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ మర్ల నాగరాజ్, జిల్లా మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం అధ్యక్షుడు బొంగోని ఉప్పలయ్య గౌడ్, నాయకులు చెరుకు కనకయ్య, సోమలింగం, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 1న అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**జిల్లాలో 2,19,625 మంది లబ్ధిదారులకు**
**రూ.95.21 కోట్లకు పైగా పింఛన్లు ....**

**భీమవరం,** నర్సాపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ ఒకటో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నరసాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి నరసాపురం నియోజకవర్గంలో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ 1వ తేదీన 25 రకాల కేటగిరీలకు చెందిన మొత్తం 2,19,625 మంది లబ్ధిదారులకు రూ.95,21,34,000 విలువైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉదయం నుంచే సంబంధిత సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను నేరుగా అందజేయాలని ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు. కేటగిరీల వారీగా పింఛన్ల వివరాలు ఇలా ఉన్నాయి: అభయహస్తం కింద 8,544 మంది లబ్ధిదారులకు రూ.44,71,000; అమరావతి ల్యాండ్‌లెస్ పూర్ కింద 4 మందికి రూ.20,000; బైలేటరల్ ఎలిఫాంటియాసిస్ గ్రేడ్--4 కింద 40 మందికి రూ.4,10,000; సీకేడీ సీరం క్రియాటినైన్ 5 ఎంజీ కంటే ఎక్కువ ఉన్న వారికి 1 పింఛన్ ద్వారా రూ.10,000; సీకేడీయూ ప్రభుత్వ కేటగిరీలో 233 మందికి రూ.23,80,000; సీకేడీయూ ప్రైవేట్ కేటగిరీలో 257 మందికి రూ.26,00,000; డప్పు కళాకారుల కేటగిరీలో 269 మందికి రూ.10,76,000; దివ్యాంగుల కేటగిరీలో 26,394 మందికి రూ.16,21,74,000 పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మత్స్యకారుల కేటగిరీలో 4,260 మందికి రూ.1,74,56,000; కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ కేటగిరీలో 62 మందికి రూ.6,30,000; మల్టీడిఫార్మిటీ లెప్రసీ కింద 450 మందికి రూ.27,60,000; వృద్ధాప్య పెన్షన్ కేటగిరీలో 1,09,355 మందికి రూ.45,12,68,000; వీల్‌చైర్ లేదా బెడ్‌కు పరిమితమైన పక్షవాతం బాధితుల కేటగిరీలో 1,010 మందికి రూ.1,51,95,000; కళాకారుల పింఛన్ల కేటగిరీలో 115 మందికి రూ.4,84,000; సైనిక్ వెల్ఫేర్ కేటగిరీలో 10 మందికి రూ.55,000 పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తీవ్ర హీమోఫీలియా కేటగిరీలో 76 మందికి రూ.7,80,000; తీవ్ర మస్క్యులర్ డిస్ట్రోఫీ కేసులు, ప్రమాద బాధితుల కేటగిరీలో 355 మందికి రూ.53,25,000; సికిల్ సెల్ డిసీజ్ కింద 12 మందికి రూ.1,30,000; ఒంటరి మహిళల కేటగిరీలో 6,675 మందికి రూ.2,76,96,000; థలసేమియా కేటగిరీలో 36 మందికి రూ.3,70,000; కల్లుగీత కార్మికుల కేటగిరీలో 2,764 మందికి రూ.1,11,52,000; సాంప్రదాయ చెప్పుల తయారీదారుల కేటగిరీలో 291 మందికి రూ.11,68,000 పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ కేటగిరీలో 31 మందికి రూ.1,36,000; చేనేత కార్మికుల కేటగిరీలో 2,443 మందికి రూ.1,00,48,000; వితంతువుల కేటగిరీలో 55,938 మందికి రూ.23,43,40,000 విలువైన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పంపిణీలో పారదర్శకత, సమర్థత పాటించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రదంగా సేవలు అందించాలని సూచించారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, మర్యాదపూర్వకంగా పింఛన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు. పంపిణీ సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన నరసాపురం నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పింఛన్లు అందుకోనున్న లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టు వద్ద కృష్ణా నీళ్లను నెత్తిన చల్లుకుని, బాటిళ్లతో పట్టుకెళ్లిన జనం




అది కేవలం నీటి ప్రవాహం కాదు, దశాబ్దాలుగా కరవు నేల చూస్తున్న కల సాకారమైన క్షణం. అందుకే, పరుగులు పెడుతున్న కృష్ణమ్మను చూసి అక్కడికి వచ్చిన జనం కేవలం కేరింతలు కొట్టడమే కాదు, ఆ నీటిని చేతులతో తాకి భక్తితో కళ్లకద్దుకున్నారు. ఎంతో పవిత్రంగా భావిస్తూ తలపై చల్లుకున్నారు. కొందరైతే తాము తెచ్చుకున్న బాటిళ్లలో ఆ పుణ్య జలాలను నింపుకుని ఇళ్లకు పట్టుకెళ్లారు. మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా కనిపించిన ఈ దృశ్యం, ఆ ప్రాంత ప్రజల గుండెల్లో కృష్ణా జలాలకు ఉన్న స్థానాన్ని, వారి నిరీక్షణ తీవ్రతను చెప్పకనే చెప్పింది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రారంభించారు. ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా జల సంబరంతో పులకించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల కళ్లముందే ప్రవాహమై పరుగులెడుతుంటే, అక్కడికి తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గేట్లు ఎత్తగానే కృష్ణమ్మ పరుగులు పెడుతుంటే, ప్రజల ఈలలు, కేరింతలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. చాలా మంది తమ సెల్‌ఫోన్లలో ఈ అపురూప దృశ్యాన్ని బంధించారు. తమ ప్రాంతానికి నీళ్లు వస్తాయో రావో అనే సందేహంతో బతికిన తాము, ఇప్పుడు కళ్లారా కృష్ణమ్మ పరవళ్లను చూస్తున్నామంటూ పలువురు రైతులు భావోద్వేగానికి గురయ్యారు. తమ జీవితాల్లో ఇదొక చారిత్రక మలుపు అని, తమ కరవు కష్టాలు తీరినట్టేనని ఆనందబాష్పాలతో తెలిపారు. సాధారణంగా సభ ముగియగానే జనం ఇళ్లకు వెళ్లిపోతారు. కానీ ఇక్కడ మాత్రం చాలాసేపటి వరకు ప్రజలు కాల్వ కట్టపైనే ఉండిపోయి, ప్రవహిస్తున్న కృష్ణమ్మను చూస్తూ మురిసిపోయారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా, మార్కాపురం జిల్లా ప్రజల గుండెల్లో నిలిచిపోయే ఒక మధుర జ్ఞాపకంగా, ఘట్టంగా మారిపోయింది.



# ఉపాధ్యాయులకు దాతృత్వమే మార్గదర్శకం!

- **మల్లగూడెం పాఠశాలకు 12 డెస్క్ బెంచీలు బహూకరించిన ఎంఈఓ**
- **రిటైర్మెంట్ రోజూ దాతృత్వం చాటుకున్న చందా రమేష్**

**తొలివెలుగు, రాజపేట:** రాజపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ ఉద్యోగ విరమణ పొందుతున్న చివరి రోజూ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలానికి చెందిన మల్లగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూర్చోవడానికి పడుతున్న ఇబ్బందులను చూసి చలించిన ఆయన సోమవారం పాఠశాలకు 12 డెస్క్ బెంచీలను బహూకరించారు. పదవీ విరమణ రోజూ విద్యార్థుల సంక్షేమం కోసం ఆలోచించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జొన్నపల్లి బాలరాజు రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. దయా హృదయంతో విద్యార్థులకు బెంచీలు అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉప సర్పంచ్ రెడ్డబోయిన కవితా రాజు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయుడు ఉదయ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్ మాలి అరుణ, పాఠశాల దాతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

**వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు**

**తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ**

**రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ**



మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఐఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# తగ్గిన దేశ వృద్ధిరేటు.. కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలు విడుదల




**అక్టోబర్–డిసెంబర్‌లో 7.8 శాతంగా నమోదు**

**అంతకుముందు త్రైమాసికంలో 8.4 శాతంగా రికార్డు**

**ఈ ఆర్థిక సంవత్సరం 7.6 శాతంగా అంచనా**

న్యూఢిల్లీ: దేశ జీడీపీ వృద్ధిరేటు తగ్గుముఖం పట్టింది. పాత సిరీస్‌ను కాదని, కొత్త సిరీస్‌ను తెచ్చి లెక్కించినా.. భారతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజాన్ని దాచలేకపోయింది నరేంద్ర మోదీ సర్కార్. ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్)లో ఆర్థిక ప్రగతి రేటు 7.8 శాతంగానే ఉన్నట్టు తేలింది మరి. అంతకుముందు త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)తో పోల్చితే 0.6 శాతం పడిపోయింది. నాడు 8.4 శాతంగా ఉన్నది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ.. 2022–23 బేస్ ఇయర్ (ఆధారిత సంవత్సరం)తో నూతన వార్షిక, త్రైమాసిక జాతీయ పద్దు అంచనాల సిరీస్‌ను విడుదల చేసింది. ఇప్పటిదాకా ఉన్న 2011–12 బేస్ ఇయర్ జీడీపీ గణన సిరీస్ స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. కాగా, జీడీపీ గణనకు బేస్ ఇయర్‌లను ఇలా సవరించడం ఇది తొమ్మిదోసారి.

**ఇదీ సంగతి..**

కొత్త సిరీస్‌తో దేశ జీడీపీ లెక్కింపు పద్ధతిని కేంద్రం సవరించింది. బేస్ ఇయర్‌ను మార్చడమేగాక, దేశంలోని ఆర్థిక కార్యకలాపాలన్నీ ప్రతిబింబించేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఈ–వాహన్ పోర్టల్‌ల డాటానూ జీడీపీ గణనకు అనుసంధానం చేశారు. ఇంతకుముందు జీఎస్టీ, ఈ–వాహన్ పోర్టల్ డాటా.. జీడీపీ లెక్కింపు పరిధిలోకి వచ్చేది కాదు. ఇదిలావుంటే కొత్త సిరీస్ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం జీడీపీ గణాంకాలను కేంద్రం సవరించింది. పాత సిరీస్ ప్రకారం 8.2 శాతంగా ఉంటే.. ఇప్పుడది 8.4 శాతానికి పెరిగింది. దీంతో చూస్తే.. అక్టోబర్–డిసెంబర్ జీడీపీ వృద్ధిరేటు 0.6 శాతం పడిపోయి 7.8 శాతానికే పరిమితమైంది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2024–25) అక్టోబర్–డిసెంబర్‌తో పోల్చితే మాత్రం పెరిగింది. అప్పుడు 7.4 శాతంగా ఉన్నది. ఇక ఈసారి తయారీ, సేవా రంగాల్లో వృద్ధి కనిపించినట్టు కేంద్రం చెప్తున్నది.

**ఈసారి 7.6 శాతం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదు కావచ్చని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పాత సిరీస్‌లో ఈ అంచనా 7.4 శాతంగానే ఉన్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 7.1 శాతంగా నమోదైన సంగతి విదితమే. కాగా, జీడీపీ గణనలో బేస్ ఇయర్ మార్పుతో దేశంలోని ఆర్థిక కార్యకలాపాల అసలు విలువ మరింత స్పష్టంగా తెలుస్తుందని మోదీ సర్కార్ భావిస్తున్నది. అందుకే మొత్తం ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాను పెంచింది. ఇక ఈ 2025–26లో దేశ జీడీపీ విలువ రూ.322.58 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2024–25లో రూ.299.89 లక్షల కోట్లుగా ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ చెప్తున్నది.

వచ్చేసారి 7–7.4% : సీఈఏ

వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) దేశ జీడీపీ వృద్ధిరేటు 7–7.4 శాతంగా ఉండొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. అయితే గత నెల జనవరిలో కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో మాత్రం ఈ అంచనా 6.8–7.2 శాతంగానే ఉన్నది. జీడీపీ గణనకు కొత్త సిరీస్ విడుదలైన నేపథ్యంలో ఇదిప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును కూడా దాటగలదన్న విశ్వాసాన్ని కొత్త సిరీస్ ప్రకటన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వ్యక్తం చేశారు.



## హైదరాబాద్‌లో రూ.350 కోట్లతో లగ్జరీ హోటల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ హైదరాబాద్‌లో దాదాపు రూ. 350 కోట్లతో లగ్జరీ హోటల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. దీన్ని చాలెట్ హోటల్స్‌కి ప్రీ--లీజుకి ఇచ్చినట్లు తెలిపింది. 5.3 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఉండే ఈ ప్రాజెక్టులో 330 గదులు ఉంటాయి. 2027--28 నాలుగో త్రైమాసికంలో ఇది పూర్తయ్యే అవకాశం ఉందని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ తెలిపింది.ఇరు సంస్థల మధ్య ఒప్పందం ప్రకారం మైండ్‌స్పేస్ రీట్‌కి చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ సంస్థ సదరు ప్రాపర?టని స్థూలంగా నిర్మించి ఇస్తుంది. ఇంటీరియర్స్, హోటల్ నిర్వహణ మొదలైన పనులను చాలెట్ చేపడుతుంది. ప్రస్తుతం చాలెట్‌కి మొత్తం మీద 3,300 గదుల పోర్ట్‌ఫోలియో ఉంది. మైండ్‌స్పేస్ రీట్‌కి హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణె చెన్నైలలో ఆఫీస్ అసెట్స్, బిజినెస్ పార్క్‌లు ఉన్నాయి.

## ఐటీ కొత్త రూల్: ఇంటి ఓనర్‌తో సంబంధం చెప్పాలి

ఆదాయపన్ను ముసాయిదా పత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటి అద్దెపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వారు ఇకపై ఇంటి యజమానితో చేసుకున్న ఒప్పంద రుజువును చూపించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి రానుండడం గమనార్హం. దీంతో ముసాయిదా పత్రాలు, నిబంధనలపై భాగస్వాములకు ఆదాయపన్ను శాఖ పంపిణీ చేసింది. వేతన జీవులు హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్‌ను చేసుకునే విషయంలో యాజమాన్యానికి ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇకపై ఫారమ్ 124లో ప్రాపర్టీ యజమానితో ఉన్న సంబంధాన్ని (అసెసీ/పన్ను చెల్లింపుదారు/దాఖలుదారు) వెల్లడించాల్సి ఉంటుంది. కల్పిత, పెంచి చూపించే అద్దె మొత్తాలకు ఈ నిబంధన చెక్ పెడుతుందని పన్ను నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ ఆదాయంపై పన్ను జమ క్లెయిమ్‌లకు సంబంధించి ఆడిటర్లు, కంపెనీలపై బాధ్యతను పెంచడం కూడా కొత్త పత్రాల్లో భాగంగా ఉంది. భారత్‌కు వెలుపల ఏదైనా ప్రాంతానికి సంబంధించిన ఆదాయంపై ఫారీన్ ట్యాక్స్ విత్‌హోల్డింగ్ సర్టిఫికెట్లను అకౌంటెంట్లు స్వతంత్రంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. చెల్లింపుల రుజువులు, కరెన్సీ మారకం లావాదేవీలు, పన్ను అర్హత నిబంధనలను, పన్ను చెల్లింపుదారు నివాస హోదాలను సైతం ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

## కమర్షియల్ గ్యాస్ వినియోగదారులకు ఊరట..
## భారీగా తగ్గిన సిలిండర్ ధర

వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ ను వినియోగించే వారికి చమురు కంపెనీలు (ాఅశ్రీ జశీఎఞూఖఅఱవం) ఊరట కల్పించాయి. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ (ూ+ ఎశ్రీఱఅసవతీ జూతీఱవ) ధరను భారీగా తగ్గించాయి. ఈ ఏడాది వాణిజ్య సిలిండర్ (జశీఎవతీఎఱశ్రీ జఎశ్రీఱఅసవతీ) ధర తగ్గడం ఇదే మొదటిసారి. ఇవాళ్టి నుంచే ఈ కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్‌పై రూ.183.50 మేర ధర తగ్గింది. దాంతో అక్కడ సిలిండర్ ధర రూ.3,113.50 నుంచి రూ.2,930 కి చేరింది. కోల్‌కతాలో రూ.174 తగ్గడంతో ధర రూ.3,081.50కి, చండీగఢ్‌లో రూ.181.50 తగ్గింపుతో రూ.2,954.50కి, పట్నాలో రూ.173 తగ్గింపుతో రూ.3,227కి ధరలు దిగివచ్చాయి. అదేవిధంగా హైదరాబాద్‌లో రూ.176 తగ్గి సిలిండర్ ధర రూ.3,191కి చేరింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడమే ఈ ధరల తగ్గింపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని 60 రోజులపాటు పొడిగించడంతో చమురు ధరలు దిగివచ్చాయి. దాంతోపాటు ప్రపంచంలోని 20 శాతం చమురు రవాణా జరిగే హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఒత్తిడి తగ్గింది. అయితే, గృహ వినియోగదారులకు మాత్రం ఈసారి కూడా ఎలాంటి శుభవార్త అందలేదు. 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.942, కోల్‌కతాలో రూ.968, ముంబైలో రూ.941.50, చెన్నైలో రూ.957.50, హైదరాబాద్‌లో రూ.994 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.



## రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, జూన్ 30 : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పలు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతోపాటు అమెరికా–ఇరాన్ దేశాల మధ్య జరిగే చర్చలపై అనిశ్చితి నెలకొనడం మదుపరుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చింది. ఒక దశలో 400 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 249.70 పాయింట్లు కోల్పోయి 76,478.67 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 80.50 పాయింట్లు కోల్పోయి 23,865.75 వద్ద స్థిరపడింది. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడం మార్కెట్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌యూఎల్ షేర్లు భారీగా నష్టపోయాయి. కానీ, మారుతి, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు దిద్దుబాటునకు గురయ్యాయని, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన మిశ్రమ ట్రెండింగ్‌ను మరింత నష్టాల్లోకి నెట్టాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా ఐటీ సూచీ అత్యధికంగా 2.62 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్, మెటల్, యుటిలిటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగ సూచీ నష్టాల్లోకి జారుకున్నాయి. కానీ, రియల్టీ, సర్వీసెస్, కన్స్యూమర్ డ్యూరబుల్, హెల్త్‌కేర్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్ రంగ సూచీలు లాభాల్లోకి వచ్చాయి.






## టాటా సియారా ఈవీ..
## ప్రారంభ ధర రూ.18.79 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 30 : ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ దేశీయ మార్కెట్‌కు మరో ఈవీ మాడల్‌ను తీసుకొచ్చింది. సియారీ ఈవీ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ రు ప్రారంభ ధరను రూ.18.79 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..గరిష్ఠంగా రూ.24.79 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్‌లు ప్రారంభించిన సంస్థ..జూలై 15 నుంచి డెలివరీ చేయనున్నట్టు ప్రకటించింది. కేవలం 5.8 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. 75 కిలోవాట్ల బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 665 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. అలాగే 63 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 565 కిలోమీటర్లకు పైగా మైలేజీ ఇవ్వనున్నది. కారుతోటే యూపీఐ చెల్లింపులు జరుపడంతోపాటు ఎయిర్‌కన్సోల్ గేమింగ్, ఈవీ రూట్ ప్లాన్ కూడా చేసుకోవచ్చునని తెలిపింది.

## వెండి పరుగులు

న్యూఢిల్లీ, జూన్ 30 : గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.6 వేలు ఎగబాకి రూ.2.30 లక్షలకు చేరుకున్నది. కానీ, బంగారం ధరలు మరింత తగ్గాయి. డిమాండ్ పడిపోవంతో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.800 తగ్గి రూ.1,45,800కి పడిపోయింది. అంతకుముందు ఇది రూ.1,46,600 గా ఉన్నట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది.






# రామాయణంలో సీత పాత్ర వివాదం..

**సాయి పల్లవి పాత ఇంటర్వ్యూ వైరల్!**

రామాయణంలో సీత పాత్రలో నటిస్తున్న సాయి పల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. సీత పాత్రకు సాయి పల్లవిని ఎలా తీసుకున్నారంటూ కొందరూ కామెంట్లు చేస్తుండగా.. ఈ చర్చల మధ్య సాయిపల్లవి గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ నెట్టింట వైరల్ అవుతోంది. సాంప్రదాయ రూపురేఖల గురించి కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, ఆమె నటనకు, సహజ సౌందర్యానికి మరికొందరు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి మొటిమల సమస్య, ఫెయిర్‌నెస్ క్రీమ్ యాడ్ తిరస్కరించడం గురించి సాయి పల్లవి గతంలో చెప్పిన ఆసక్తికర విషయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. సినిమాల్లోకి రాకముందు తనకు ఉన్న మొటిమలు, రోసిషియా సమస్య కారణంగా ఎంతో ఆందోళన చెందానని సాయి పల్లవి గతంలో తెలిపారు. 'ప్రేమమ్' సినిమా విడుదలకు ముందు నేను ఎన్నో ఫెయిర్‌నెస్ క్రీమ్‌లు వాడాను. ముఖంపై మొటిమల వల్ల ఎంతో మానసిక వేదన అనుభవించాను. నలుగురిలోకి వెళ్లడానికి భయపడేదాన్ని. జనం నా కళ్లను కాకుండా నా మొటిమలనే చూస్తున్నారని బాధపడేదాన్ని అని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే 'ప్రేమమ్' చిత్రంతో ప్రేక్షకులు తనను ఉన్నట్లుగానే ఆదరించడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు. సౌందర్య ప్రమాణాలు, రంగు వివక్షపై సాయి పల్లవి ఎప్పుడూ కఠినంగా వ్యవహరిస్తుంటారు. ఇందులో భాగంగానే రూ. 2 కోట్ల విలువైన ఫెయిర్‌నెస్ క్రీమ్ ఎండార్స్‌మెంట్ ఆఫర్‌ను ఆమె సున్నితంగా తిరస్కరించారు. సమాజంలో ఇటువంటి ప్రచారాలు యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆమె భావించారు. సమాజంలో రంగు ఆధారంగా ఎంతోమందిని చిన్నచూపు చూస్తున్నారు. అలాంటి ప్రమాణాలను నేను ప్రమోట్ చేయలేను అని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె పాత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.



# పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా

**నటి మాళవికా మోహనన్**

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉపశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.




# ఆది కొత్త సినిమా సైరాబాను

## క్లాప్ కొట్టిన నటుడు కిరణ్ అబ్బవరం

**టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.**


# ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో ముందుకు సాగుతా: శ్రీలీల

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.



# కొత్త మూవీని ప్రకటించిన సాయిదుర్గా తేజ్

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు సాయి దుర్గా తేజ్. తాజాగా ఆయన ఒక కొత్త మూవీని ప్రకటించారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న సుజీత్, సందీప్ ల దర్శకత్వంలో సాయిదుర్గా తేజ్ హీరోగా ఈ చిత్రం రానుంది. 'ఎస్‌డీటీ 19' వర్కింగ్ టైటిల్‌తో దీన్ని అధికారికంగా ప్రకటించారు. 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు.. అత్యంత శక్తిమంత ప్రయాణమిది' అని క్యాప్షన్‌తో దీనిపై పోస్ట్ పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు)తో బిజీగా ఉన్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి. దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. దీనిపై ఇటీవల ఈ హీరో మాట్లాడుతూ.. 'బ్రో' తర్వాత ఖరారైన నా రెండు సినిమాలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఇందులో నటించే అవకాశం వచ్చింది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా కష్టపడుతున్నా. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా నా కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని అన్నారు.




Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com